యాదాద్రీశులకు భక్తుల దైవారాధనలు

దైవ దర్శనానికి రద్దీ

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో భక్తజనుల ఆర్జిత పూజలతో పంచ నారసింహుల సన్నిధిలో ఆధ్యాత్మికత నెలకొంది. సుప్రభాతంతో వేకువజామున మొదలైన నిత్యారాధనలు రాత్రివేళ జరిపిన శయనోత్సవం కైంకర్యంతో తెరపడింది. మధ్యాహ్నం వరకు దైవదర్శనానికి భక్తులు బారులు తీరారు. పూజారులు మూలవరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసుదర్శన హోమం, నిత్యకల్యాణం, స్వర్ణ పుష్పారాధన, అలంకార సేవోత్సవాలు ఆలయ ఆచారంగా కొనసాగించారు. సాయంత్రం శ్రీలక్ష్మీనరసింహ స్వామి అలంకార సేవోత్సవాన్ని వేద, మంత్రాల మధ్య నిర్వహించారు. రాత్రి వేళ స్వయంభువులకు ఆరాధన, సహస్రనామార్చన నిర్వహించారు. శివాలయంలో నిత్యపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వంద పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించాలి

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరులోని ప్రభుత్వ సామాజిక వైద్యశాలను వంద పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించాలని సీపీఎం ఆలేరు పట్టణ కార్యదర్శి ఎంఏ ఎక్బాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఆసుపత్రికి మంజూరైన ఐసీయూ యూనిట్‌ను మనుగడలోకి తీసుకురావాలన్నారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారిన నేపథ్యంలో ఆలేరు ఆసుపత్రిని స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వవిప్ అయిలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మొరిగాడి రమేష్, దూసరి భిక్షపతి, మంజుల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల రక్షణకు అడుగులు

- ఆక్రమణల గుర్తింపునకు కదిలిన యంత్రాంగం

ఈనాడు, నల్గొండ – న్యూస్‌టుడే, నల్గొండ పురపాలిక : ప్రభుత్వ ఆదేశాలతో నీటి వనరులకు రక్షణగా అధికార యంత్రాంగం కదులుతోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోని నీటి వనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఆక్రమణలు ఏమైనా ఉన్నాయా, కబ్జాలకు గురయ్యాయా.. అనే వివరాలను సేకరిస్తున్నారు. మరోవైపు ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఈ సర్వేలతో ఆందోళన చెందుతున్నారు.

సూర్యాపేట సద్దుల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిలో ఇటీవల సర్వేకు వెళ్లారు. బాధితులు సర్వేను అడ్డుకోవడంతో పాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో జనావాసం లేని ప్రాంతాల్లో చెరువులను ఆక్రమించి స్థిరాస్తి వ్యాపారం చేస్తూ వెంచర్లు వేసిన వాటిని తొలి దశలో సర్వే చేయనున్నట్లు తెలిసింది. పురపాలికల్లో రెవెన్యూ, నీటిపారుదల శాఖలతో కలిసి పుర అధికారులు, మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ నీటిపారుదల శాఖ అధికారులు ఈ సర్వేలు నిర్వహించనున్నట్లు తెలిసింది.

పక్షం రోజుల్లో ఎక్కువ ఆక్రమణలున్న వాటిని గుర్తించి ఎంత మేరకు భూమి కబ్జాకు గురయిందో నిర్ధారించి తదుపరి చర్యలను సూచించాలని తెలుపుతూ సమగ్ర నివేదికను సర్కారుకు సమర్పించనున్నారు. ఉమ్మడి జిల్లాలో గత సర్వే ప్రకారం వివరాలు

మొత్తం చెరువులు, కుంటల సంఖ్య: 4454
50 శాతం కంటే ఎక్కువగా ఆక్రమణకు గురైనవి: 250
25 శాతం మేర అన్యాక్రాంతమైనవి: 500
మరికొన్ని చెరువులు పాక్షికంగా ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు

నల్గొండ: కేశరాజుపల్లి మేడికుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన ప్రహరీ

అనుమతుల్లేకుండానే నిర్మాణాలు

రెవెన్యూ శాఖలోని లొసుగులు, నీటిపారుదల, పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో చాలా చెరువుల్లోని శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతుల్లేకుండానే నిర్మాణాలు చేపట్టారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారితో పాటు నార్కట్‌పల్లి - అద్దంకి రహదారుల పక్కన ఉన్న చెరువులు గత పదేళ్లలో అనేకం కబ్జాకు గురయ్యాయి. స్థిరాస్తి వ్యాపారులకు స్థానిక రాజకీయ నాయకుల అండ ఉండటంతో ఈ క్రతువు గత పదేళ్లలో యథేచ్ఛగా సాగింది.

☛ నల్గొండ, చౌటుప్పల్, భువనగిరి, కోదాడ, మిర్యాలగూడ, బీబీనగర్, కోదాడ ప్రాంతాల్లో ఈ ఆక్రమణల దందా ఎక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లోనే అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వగా... చాలా ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో నిర్మాణాలు చేపట్టారు.

కబ్జా దృష్టాంతాలు కొన్ని..

☛ నల్గొండ పురపాలిక పరిధి కేశరాజుపల్లిలో నార్కట్‌పల్లి -అద్దంకి రహదారి పక్కనే పాతపల్లెకు వెళ్లే మార్గంలో మేడికుంట చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో రూ. కోట్లు విలువైన స్థలంలో కొందరు వ్యాపారులు ప్రహరీ నిర్మించారు. కతాల్‌గూడ చెరువు కనుమరుగవుతోంది.

☛ కోదాడ పెద్ద చెరువు సైతం సుమారు 200 ఎకరాల్లో కబ్జాకు గురైందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పెద్ద చెరువు అలుగుకు అడ్డంగా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతోనే ఇటీవల వరదలు వచ్చాయని ప్రభుత్వానికి అధికారులు నివేదిక సమర్పించారు.

☛ నకిరేకల్ పెద్దచెరువును రూ.6 కోట్ల వ్యయంతో మినీ ట్యాంకు బండుగా అభివృద్ధి చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో సుమారు 40కిపైగా అక్రమ నిర్మాణాలున్నట్లు గతంలోనే అధికారులు గుర్తించారు.

☛ భువనగిరి, బీబీనగర్ మండలాల్లోనూ పలు చెరువులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి.

☛ చౌటుప్పల్ మండలంలోనూ పలు చెరువుల్లో స్థిరాస్తి వ్యాపారులు అక్రమ నిర్మాణాలు చేపట్టారు.

☛ సూర్యాపేట సద్దుల చెరువులో ప్రస్తుతం సర్వే కొనసాగుతోంది.

☛ హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లోనూ ఫిర్యాదులు వచ్చిన ఆక్రమణలపై అధికారులు సర్వే నిర్వహించనున్నారు.

సర్దుబాటుకు కసరత్తు


బోధిస్తున్న ఉపాధ్యాయుడు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు విద్యాశాఖ గతంలో చేపట్టిన సర్దుబాటు ప్రక్రియ సత్ఫలితాలను ఇవ్వలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా, ఉపాధ్యాయుల అవసరాలను బట్టి మళ్లీ చేపట్టనున్న సర్దుబాటు ప్రక్రియ ఉపాధ్యాయ సంఘాలు ప్రస్తుతం వ్యతిరేకిస్తున్నాయి. తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరదని, నియామక ప్రక్రియ వేగవంతం చేసి విద్యాప్రమాణాలు పెంచాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మారుమూల ప్రాంతాల్లో పోస్టులు ఖాళీగా..

నాడు అవసరం ఉన్న పోస్టులను చూపించి, కొన్ని పోస్టులను బ్లాక్ చేసిన పక్షంలో మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలోని పోస్టులు భర్తీ అయ్యేవని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. దీంతో నేటికి జిల్లాలోని మారుమూల మండలాలు అయిన గుండాల, అడ్డగూడూరు, రాజపేట మండలాల్లోని పాఠశాలల్లో అత్యధిక పోస్టులు ఖాళీగా మిగిలాయి. దీనికి తోడు ప్రాథమిక పాఠశాలల్లోని అర్హులైన ఎస్జీటీలు పదోన్నతులు పొందారు, బదిలీ అయ్యారు. వీరి స్థానంలో డీఎస్సీ ద్వారా నూతన ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంది.

పాఠశాలల్లో పరిస్థితులు...

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు, మరి కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు అధికంగా ఉన్నారు. ఇటీవల చేపట్టిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా అర్హులైన ఉపాధ్యాయులు తమకు అనుకూలంగా ఉన్న మండలాల్లోని పాఠశాలను ఎంపిక చేసుకుని ఉద్యోగాల్లో చేరారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా ఖాళీగా ఉన్న పోస్టులు అన్ని చూపించడంతో కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయులు తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు.

సర్దుబాటు ఇలా...

జిల్లా వ్యాప్తంగా జులై నెలలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. 110 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా 70 మంది విధుల్లో చేరారు. జిల్లా వ్యాప్తంగా 712 పాఠశాలలు పనిచేస్తున్నాయి. ఇందులో 38,277 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కలెక్టర్ అనుమతితో మళ్లీ సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసేందుకు విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. మండల విద్యాధికారులతో ఎక్కడ ఉపాధ్యాయులు అవసరం ఉన్నారో నివేదికలు తెప్పించుకుంటున్నారు.


జిల్లాలో పాఠశాలల సంఖ్య: 712 🟦
పనిచేస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య: 3,497 🟥
పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య: 38,277 🟨

వివరాలు సేకరిస్తున్నాం : – కందుల సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి

పాఠశాలల్లో నెలకొన్న పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నాం. సర్దుబాటు చేయాల్సిన ఉపాధ్యాయుల పోస్టుల వివరాలను మండల విద్యాధికారుల ద్వార నివేదిక తెప్పించుకుంటున్నాం. వివరాల సేకరణ పూర్తయిన వెంటనే ఎక్కడ ఏ ఉపాధ్యాయుడు అవసరం అవుతారో వారిని అక్కడ సర్దుబాటు చేస్తాం.

న్యాయ వ్యవస్థలో పనిచేయడం గొప్ప అవకాశం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: న్యాయ వ్యవస్థలో పనిచేయడం గొప్ప అవకాశమని ఉద్యోగులు తమ విధులను సమర్థవంతగా నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు అన్నారు. భువనగిరిలోని ఎంఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం న్యాయశాఖ ఉద్యోగుల రాష్ట్ర ఎగ్జిక్యూటివ్, జిల్లా సర్వసభ్య సమావేశం, ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు, అఖిల భారత న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బోద లక్ష్మారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి వి.వి రమణారావు హాజరై మాట్లాడారు. న్యాయశాఖ ఉద్యోగులు ఐక్యంగా కొనసాగాలన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న యాదాద్రి భువనగిరి న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, సీనియర్ సూపరింటెండెంట్లు కె. వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు, భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేస్తున్న వెంకటరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు, చిత్రంలో జడ్జి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యోగ సంఘం కార్యవర్గం

భువనగిరి యువకుడికి ఏఈఈగా ఉద్యోగం

భువనగిరి, న్యూస్‌టుడే: భువనగిరి హన్మాన్‌వాడకు చెందిన బండ సాయివినీత్‌కు నీటిపారుదల శాఖలో ఏఈఈగా ఉద్యోగం లభించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇటీవల నియామక పత్రాన్ని అందుకున్నారు. వినీత్ తండ్రి బండ కృష్ణ ఆర్టిస్ట్‌గా పనిచేశారు. కష్టపడి ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆయన ఏఈఈగా ఉద్యోగం సాధించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

బండ సాయి వినీత్

యాదాద్రిలో పైవంతెన అనుసంధానానికి సన్నాహాలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి వెళ్లే కనుమదారిని కలిపే పైవంతెన పనులు రెండేళ్లుగా నిలిచిపోవడంతో పెద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తొలి ఘాట్‌రోడ్డును కలిపేందుకు, పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీదేవి సత్రభవనం ఎదుట నుంచి పైవంతెన నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. సుమారు రూ.33 కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల్లో భాగంగా లండన్ కేబుల్‌తో పై వంతెనకు అనుసంధానించే ఏర్పాట్లు త్వరలోనే మొదలు పెడతామని ఇటీవల రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. వంతెన నిర్మాణం పూర్తి చేసి, ఈ క్షేత్రానికి వచ్చే భక్తులకు అనుగుణంగా ఆధ్యాత్మిక సేవలు అందించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.

పూర్తి కాకుండా నిలిచిపోయిన పై వంతెన

కళ్లుకప్పి.. సరిహద్దు దాటించి

- జోరుగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- విద్యార్థులకు సరఫరా చేసే సన్నాలనూ వదలని అక్రమార్కులు

ఇటీవల భువనగిరిలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లారీని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధకారులు (పాతచిత్రం)

ఇటీవల భువనగిరి శివారులోని నల్గొండ పైవంతెన వద్ద రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. పౌరసఫరాల సంస్థ సాంకేతిక సహాయకుడు తనిఖీ చేసి లారీలోని బస్తాల్లో పీడీఎస్ బియ్యంలో కలిపే ఎఫ్ఆర్‌కే రైస్ ఉందని గుర్తించారు. అవి పీడీఎస్ బియ్యంగా తేల్చారు. విద్యాసంస్థలు హాస్టల్‌కు సరఫరా చేసే సన్న బియ్యంగా తేలడంతో ఆ లారీని సీజ్ చేశారు. 30 కిలోల చొప్పున 1100 బస్తాలో తరలిస్తున్నారు. అందులో 350 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. ప్రస్తుతం ఆ బియ్యాన్ని భువనగిరిలోని పౌరసరఫరాల సంస్థ గోదాములో భద్రపరిచి, లారీని పోలీసులకు అప్పగించారు. 6ఏ కేసు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి డీసీఎస్‌వో వనజాత 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

భువనగిరి, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. నిఘా విభాగం కళ్లుకప్పి అక్రమార్కులు లారీల కొద్దీ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు దొడ్డు బియ్యాన్ని మాత్రమే అక్రమంగా కొని రీసైక్లింగ్ చేస్తున్న వ్యాపారులు.. ఇప్పుడు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాలకు సరఫరా చేసే సన్న బియ్యాన్నీ వదలడం లేదు. ఇటీవల భువనగిరి శివారులో అధికారుల తనిఖీల్లో రెండు లారీల లోడ్లు పట్టుబడగా ఒక లారీలో పాఠశాలలు, వసతిగృహాలకు సరఫరా చేసే సన్న బియ్యం ఉండటం గమనార్హం.

లోపాలను ఆసరాగా చేసుకొని..

మార్కెట్‌లో సన్నబియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వాటిపై అక్రమార్కుల దృష్టి పడింది. కొందరు రైస్ మిల్లర్లు, అధికారులతో కుమ్మక్కై విద్యార్థులకు అందించే సన్న బియ్యాన్ని దారి మళ్లిస్తున్నారు. వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు ఎవరికి అనుమానం రాకుండా రేషన్ బియ్యాన్ని పొరుగు రాష్ట్రాలకు చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా సన్న బియ్యానికి రూ.5 వేల నుంచి రూ.6,500 వరకు ధర పలుకుతోంది. పీడీఎస్ బియ్యాన్ని సేకరించి ఎవరూ గుర్తించకుండా బ్రాండ్ పేరుతో కూడిన బస్తాల్లో నింపి సాధారణ బియ్యంలా లారీల్లో తరలిస్తున్నారు.

పీడీఎస్ బియ్యాన్ని బ్రాండెడ్ బస్తాలో నింపిన దృశ్యం

☆ ఉమ్మడి జిల్లాలో రాజపేట, వలిగొండ, బొమ్మలరామారం, ఆలేరు, తుర్కపల్లి మండలాల్లో అక్రమ రవాణా చేస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. సూర్యాపేట, నల్గొండ జిల్లాలో కూడా ఎక్కడ పడితే అక్కడ పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ఒక్క యాదాద్రి భువనగిరి జిల్లాలోనే ఈ ఏడాది 83 కేసులు నమోదయ్యాయి. అధికారులు నిఘా పెంచి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బిల్లు ఉండాలి

– ఆర్.పద్మ, అసిస్టెంట్ కమిషనర్, జీఎస్‌టీ భువనగిరి

బియ్యంపై ఎలాంటి పన్ను లేదు. 25 కిలోల బ్యాగ్‌కు మాత్రమే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. వేబిల్లు అవసరం లేదు. ఎక్కడి నుంచి ఎటు రవాణా చేస్తున్నారు.. బిల్లు ఉంటే సరిపోతుంది.

సరస్ ఫెయిర్‌కు మహిళా సంఘాల సభ్యులు

భువనగిరి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఈ నెల 27న ప్రారంభమైన సరస్ ఫెయిర్-2024లో పాల్గొనేందుకు యాదాద్రి జిల్లాకు చెందిన మహిళా సంఘాల సభ్యులు ఆదివారం బయల్దేరి వెళ్లారు. జిల్లాకు చెందిన 85 మంది ప్రతినిధులు రెండు బస్సుల్లో బయల్దేరి వెళ్లారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీఆర్‌డీవో నాగిరెడ్డి, జిల్లా సహాయ విజిలెన్స్ అధికారి మందడి ఉపేందర్‌రెడ్డి జెండా ఊపి బస్సులను పంపించారు. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, గోవా, అస్సాం, తమిళనాడు రాష్ట్రాల నుంచి స్వయం సహాయక సంఘాల ద్వారా తయారు చేసి వస్తువులను ప్రదర్శిస్తారు.

జిల్లా నుంచి బయల్దేరుతున్న బస్సులను ప్రారంభిస్తున్న ఉపేందర్‌రెడ్డి, నాగిరెడ్డి

అసలే ఇరుకు ఆపై కొత్త ధాన్యం

రెండేళ్ల నాటి వడ్లను తీసుకెళ్లని గుత్తేదారు

మిల్లులను వేధిస్తున్న స్థలం సమస్య

హుజూర్‌నగర్‌లోని మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రస్తుత వానాకాలంలో వర్షాలు బాగా కురవడంతో వరి సాగు జోరందుకుంది. మరో వారం రోజుల్లో పంట చేతికి రానున్నందున కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే మిల్లుల్లో రెండేళ్ల నాటి యాసంగి ధాన్యం నిల్వ ఉంది. వాటిని తరలించకుంటే, స్థలం ఉండదని, ఇప్పుడు కొన్న వడ్లను తమకు కేటాయిస్తే ఎక్కడ నిల్వ చేయాలని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.

అప్పుడేమైందంటే..?

రెండేళ్ల క్రితం యాసంగిలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యంలో 7,89,275 మెట్రిక్ టన్నులను విక్రయించాలని నిర్ణయించింది. మిల్లుల్లో నిల్వచేసిన వడ్లను అప్పుడే వేలం వేశారు. తక్కువ ధరకు గుత్తేదారుకు అప్పగించారనే ఆరోపణలతో ఆ వేలాన్ని రద్దుచేశారు. ఈ లోపు ఎన్నికలొచ్చాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ఈ సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. తొమ్మిది నెలల క్రితం తిరిగి వేలం వేశారు. ఆ వేలంలో ధాన్యాన్ని దక్కించుకున్న గుత్తేదారు 2,46,978 మెట్రిక్ టన్నులను మాత్రమే తీసుకెళ్లారు. ఇంకా 5,42,297 ఎంటీల వడ్లు ఉమ్మడి జిల్లాల్లోని మిల్లుల్లోనే ఉన్నాయి. వాటిని మూడు నెలల్లో తీసుకెళ్లాలని ప్రభుత్వం తాజాగా గుత్తేదారుకు గడువిచ్చింది. ఆ ధాన్యం బాగా చెడిపోవడంతో పరిహారంగా డబ్బు చెల్లించాలని గుత్తేదారు కోరుతున్నారు. ఒప్పుకున్న కొందరు మిల్లర్లు చెల్లించారు. చాలామంది తమకు సంబంధం లేదని, కొనుగోలు కేంద్రం నుంచి అలాగే వచ్చిందని చెబుతున్నారు. దీంతో గుత్తేదారు ఆ మిల్లుల నుంచి ధాన్యం తీసుకెళ్లడం లేదని తెలిసింది. మిల్లులో ఎక్కువ ధాన్యం ఉండటం వల్ల స్థలం సమస్య ఏర్పడుతోందని, కొత్త ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో వేలం వేసిన ధాన్యం వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)



అక్టోబరు నుంచి కొత్త ధాన్యం రాక..!

నల్గొండ జిల్లాలో అక్టోబరు మొదటి వారంలో ప్రస్తుత వానాకాలానికి సంబంధించిన కొత్త ధాన్యం వస్తుందని అధికారుల అంచనా వేశారు. సూర్యాపేట జిల్లాలో మూడో వారంలో వస్తుందని చెబుతున్నారు. ఆ లోపు మిల్లుల్లో నిల్వ చేసిన వేలం ధాన్యాన్ని ఖాళీ చేయించడం అంత సులభం కాదు. ప్రభుత్వం గుత్తేదారుకు మూడు నెలల గడువు ఇచ్చిన నేపథ్యంలో మిల్లర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించకుంటే రైతులు, ప్రభుత్వం, అధికారులు ఇబ్బంది పడాల్సి వస్తుంది.

పదవీ విరమణ శుభాకాంక్షలు

శ్రీ & శ్రీమతి బొడ్డు సురేంద్రరావు (సాలయ్య) - లక్ష్మి
Executive Engineer
I&CAD Irrigation Div.No.7, Nalgonda
గత 37 సంవత్సరాలుగా వివిధ హోదాలలో, విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి, నీటిపారుదల శాఖలో ఉత్తమ ఇంజనీర్‌గా ఎంపికై, అందరి మన్ననలు పొంది, కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన మీరు నేడు ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా శుభాకాంక్షలు. మీ భావిజీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షిస్తూ...
భార్య: లక్ష్మి
కుమారుడు - కోడలు: Er. పృథ్వీరాజ్ B.Tech - శ్రావణ M.Sc
కూతురు - అల్లుడు: Dr. పోలేపల్లి తేజస్వి MDS - Dr. ప్రవీణ్ MBBS
మనుమలు: వియాన్ ఆద్విక్, విహాను, వివాను, బంధుమిత్రులు

నమూనా ప్రకటన
బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా అందరికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటయిన శ్రీ..................... తం ....నివాసంగా శ్రీ.....................వారికి చెందినటువంటి గృహము ఇంటినెం. మరియు ఖాళీ జాగా, ఈ క్రింది హద్దులు గల ఉత్తరం: ఇతరుల ఖాళీ జాగా, దక్షిణం: 20 ఫీట్ల రోడ్డు, తూర్పు ఇతరుల ఖాళీ జాగా, పడమట.............గారి ఇల్లు. పట్టణంలో గల దానిని కొనడానికి అగ్రిమెంటు కుదుర్చుకున్నారు. మరియు అడ్వాన్సు కూడా ఇచ్చియున్నారు. ఇట్టి విషయంగా ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల వారం రోజులలోగా సాక్ష్యములతో సహా నన్ను సంప్రదించగలరు. ఆ తరువాత వచ్చే ఎటువంటి క్లెయిమ్‌లు నా క్లయింటును బైండు చేయజాలవు.
సం/-
అడ్వకేట్

విజ్ఞతగల నిర్ణయం వివాదాలకు అతీతం

లక్షల విలువైన స్థిరాస్తిని కొనేముందు సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం.
'ఈనాడు'లో బహిరంగ ప్రకటన ఇవ్వడం ఎంతో సులభం.
ప్రకటనలపై 25% డిస్కౌంట్
GST 5% అదనం
వివరాలకు సంప్రదించండి:
నల్గొండ: 80080 01770, సూర్యాపేట: 96528 85838, 80081 16681
కోదాడ: 80087 09942, మిర్యాలగూడ: 91771 11894, భువనగిరి: 80080 01643

(c) eenadu

యాదాద్రి మిగులు పనులపై దృష్టి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. భక్తులకు వసతులు కల్పించడంతో పాటు భవిష్యత్తు అవసరాలను తీర్చే కార్యాచరణతో కూడిన నివేదిక తయారు చేయాలని ఇటీవల ఆదేశించారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిలో మిగులు పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసేందుకు నివేదిక అందించాలని వైటీడీఏను ఆదేశించింది.

✦ ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే తీర్థజనులకు స్వయంభువులైన పంచనారసింహుల గర్భాలయంపై 45 అడుగుల ఎత్తు గల కృష్ణశిల విమానం పసిడి రూపంలో దర్శనం ఇచ్చేలా సిద్ధం కానుంది. ఇందుకు వీలైనంత త్వరగా స్వర్ణ తాపడం పనులకు తెర తీసేందుకు సీఎం సూచనలతో దేవాదాయ శాఖ సంసిద్ధమైంది. దసరా రోజు అక్టోబరు 13న ఈ క్షేత్రానికి సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి బంగారు విమానం రూపకల్పన, పనులకు శ్రీకారం చుట్టే అవకాశాలు ఉన్నాయి.

✦ ఈ ఆలయానికి ధర్మకర్తల మండలిని రెండేళ్ల కాల పరిమితి కోసం 2007లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నాటి నుంచి ధర్మకర్తల నియామకం అటకెక్కించారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఈ ఆలయానికి తితిదే లాంటి పాలకమండలి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

3 నుంచి దేవీ నవరాత్రోత్సవాలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలోని శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుకల నిర్వహణకు కొండపై గల శివాలయాన్ని తీర్చి దిద్దుతున్నారని ఈవో భాస్కర్ రావు తెలిపారు. సప్తశతి పారాయణం, లక్ష కుంకుమార్చన క్రతువులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

యాదాద్రి క్షేత్రంలో శివాలయం

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆదివారం నగర శివారులోని మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో వరంగల్, మెదక్ జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 49.2 ఓవర్లలో 219 పరుగులు చేసింది. జట్టులో వితేష్ 31 పరుగులు(3 వికెట్లు), రిష్యాంత్ 31 పరుగులు(3 వికెట్లు) తీశారు. ఛేదనకు దిగిన మెదక్ జట్టు 29.4 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌట్ అయ్యింది. కోమటిపల్లి మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, నల్గొండ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్ రఫే 71 పరుగులతో రాణించాడు. ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు 32 ఓవర్లలో 98 పరుగులకే ఆలౌట్ అయ్యింది. పూల్ 'ఏ'లో లీగ్ పోటీల్లో మహబూబ్‌నగర్ ముందంజలో ఉందని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి మ్యాచ్‌లు: కోమటిపల్లి మైదానంలో వరంగల్ × నల్గొండ జట్లు, మొగిలిచర్లలో మహబూబ్‌నగర్ × మెదక్ జట్ల మ్యాచ్

బాల్యం.. పుస్తకానికి దూరం

నాంపల్లి, న్యూస్‌టుడే:

పుస్తకమనేది అక్షరాలతో పాటు మానవ సంబంధాలను తనలో అందంగా దాచుకున్న తరగ(తి)ని గని. పదాలతో పలకరిస్తూ.. ప్రపంచాన్ని మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. కథలు..కామిక్‌లు.. ఇలా దేనిపై చిన్నారికి ఆసక్తి ఉంటే తల్లిదండ్రులు దానికి సంబంధించి ఓ పుస్తకాన్ని వారి ముందు ఉంచండి. మనిషి తన జీవన గమనాన్ని మార్చుకోవడానికి పుస్తకానికి మించిన సాధనం మరొకటి లేదని వారికి అర్థమయ్యేలా వివరించండి. ఆధునిక సమాజంలో నేటి తరాన్ని పుస్తక పఠనానికి దగ్గర చేయండి. అదే సమాజానికి మీరిచ్చే విలువైన కానుక.

మానవ మస్తిష్కాలను రగిలించి శక్తిమంతులను చేసేది పుస్తకం.. అలాంటి పుస్తకం రోజుకో కొత్త యాప్స్‌తో పుట్టుకొస్తున్న చరవాణి ప్రపంచంలో మనిషికి దూరమవుతోంది. భావిపౌరులైన నేటి బాల్యం పొరపాటుగానైనా పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవడంలేదని మేధావులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు, గురువులు పుస్తకాల విలువను నేటి తరానికి తెలియజెప్పాలి. ఆ అలవాటును వారి దరికి చేర్చాలి. నేటి చిన్నారులు ఆధునిక అలవాట్లతో బంధీలవుతున్నారు.

కారణాలు ఇవీ..

- ❖ తల్లిదండ్రులు పుస్తకాలు చదివేలా ప్రోత్సహించకపోవడం. చరవాణి, కంప్యూటర్ ఆటలు, సినిమాలు, సామాజిక మాధ్యమాలకు అలవాటు పడటం.
- ❖ సరైన పుస్తకాన్ని పిల్లలు ఎంపిక చేసుకోకపోవడం. చదవడంలో పిల్లలకున్న ఇబ్బందులు తల్లిదండ్రులు గుర్తించకపోవడం.
- ❖ ఆటలపైనే అమితాసక్తి ఉండటం. ఒక చోట నిశ్చింతగా కూర్చోలేకపోవడం.

ఉమ్మడి జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో 100 మంది పిల్లలతో 'న్యూస్‌టుడే' బృందం మాట్లాడగా ఇలా..



పాఠ్యాంశాలు కాకుండా వేరే పుస్తకాలు చదివే అలవాటు ఉందా?

జేబు ఖర్చులు దేని కోసం వినియోగిస్తారు?

వినోదం, కాలక్షేపం కోసం ఏం చేస్తుంటారు?

బహుమతిగా ఇవ్వాలి..

పిల్లలకు చిన్ననాటి నుంచే పుస్తక పఠనం అలవాటు చేయాలి. ఏదైనా సందర్భం వస్తే పుస్తకాలు బహుమతిగా ఇచ్చి పఠనంపై దృష్టి మరల్చేలా చూడాలి. చందమామా, బాలమిత్ర, బొమ్మరిల్లు లాంటి కథల పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. వాటిలోని నీతిని వారికి వివరించాలి. అప్పుడప్పుడు గ్రంథాలయాలకు తీసుకెళ్లి పాఠకుల ఆసక్తిని గమనింపజేయాలి. మంచి పుస్తకాల గురించి పిల్లలతో విస్తృతంగా చర్చించాలి. ఇంటి ప్రధాన హాల్లో, పిల్లల గదిలో పుస్తకాలు ఉండేలా చూడాలి. పుట్టిన రోజు నాడు ఓ మంచి పుస్తకం ఇవ్వాలి. ఇంటిలో ఓ చిన్న పాటి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి.

చరవాణి, టెలివిజన్‌పై పిల్లల ఆసక్తి..

నేటి చిన్నారులు టీవీలు, చరవాణులకు అతుక్కుపోయి కామిక్ కథలు, హింసను ప్రేరేపించే దృశ్యాలను ఎక్కువగా చూస్తున్నారు. పలు ఆంగ్ల చిత్రాల సన్నివేశాలకూ ప్రభావితమైన వారున్నారు. అదే పనిగా చరవాణికి అతుక్కుపోయి పుస్తకం పట్టని వారే ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి అలవాట్లు ఉన్న చిన్నారుల గుండె వేగం గణనీయంగా పెరిగిందని ఇటీవల ఓ సర్వేలో వెల్లడైంది. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను ఆసక్తి ఉన్న పుస్తకాల పఠనం వైపు మళ్లించాల్సిన ఆవశ్యకతను తల్లిదండ్రులు గుర్తించాలి.

పుస్తక పఠనంతో లాభాలు

బోయపల్లి రాంశెట్టి, విశ్రాంత ప్రధానాచార్యులు,
ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాంపల్లి

పుస్తక పఠనంతో విద్యార్థులతో పాటు పెద్దలకు చాలా లాభాలున్నాయి. ఉన్నత వ్యక్తిత్వంతో పాటు సానుకూల దృక్పథం అలవడుతుంది. స్వయం ప్రేరణ, క్రమశిక్షణ, సామాజిక నైపుణ్యాలు మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. సందర్భమేదైనా పిల్లలకు మంచి పుస్తకాలు బహుమతిగా ఇవ్వడం వారి భవిష్యత్తుకు బాటలు వేయడంలో భాగమనే విషయం మరువొద్దు.

పట్టుదలతో..ఓ ప్రణాళికతో..

టాస్క్ శిక్షణ సద్వినియోగం చేసుకుంటున్న డిగ్రీ విద్యార్థులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: కలల కొలువు సాధించాలని యువత భావిస్తుంటే.. దానికి తగ్గట్టు నైపుణ్యాలు ఉండాల్సిందేనని కంపెనీల యాజమాన్యాలు ఆకాంక్షిస్తున్నాయి. ఈ రోజుల్లో చదువు పూర్తవగానే ఉద్యోగం రావడం అంత సులువేం కాదు. అందుకు ప్రతి విద్యార్థికి ఉద్యోగ నైపుణ్యాలు అవసరం. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నైపుణ్యాల పెంపుదలే లక్ష్యంగా ప్రభుత్వం ఐటీశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ను ఏర్పాటు చేసింది.

టాస్క్ శిక్షణలో డిగ్రీ విద్యార్థులు

✦ టాస్క్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు నైపుణ్యాల శిక్షణను ఇస్తున్నారు. ప్రధానంగా విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్ల భాష పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ సామర్థ్యాలు, ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా మనోధైర్యం, వ్యక్తిగత సామర్థ్యాలు, బృందాన్ని నడిపించగల నైపుణ్యం, సాంకేతిక, విజ్ఞాన అంశాలను నేర్పిస్తున్నారు.

✦ ఇటీవల నల్గొండ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్‌లో టాస్క్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు డిగ్రీ విద్యార్థులకు ఆయా అంశాల్లో తర్ఫీదు ఇచ్చారు. ఇందులో ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. ఉద్యోగాల సాధన కోసం టాస్క్ శిక్షణ పొందుతున్న జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల విద్యార్థులను 'న్యూస్‌టుడే' పలకరించింది.

ఉద్యోగ సాధనకు శిక్షణ

– అఖిల, కాకతీయ డిగ్రీ కళాశాల, నల్గొండ

బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్నా. ఉద్యోగ మేళాలో సత్తా చాటాలనే లక్ష్యంతో ప్రస్తుతం టాస్క్ శిక్షణ తీసుకుంటున్నా. కళాశాలలో ఎప్పటికప్పుడు నిర్వహించే టాస్క్ శిక్షణ తరగతుల ద్వారా వ్యక్తిత్వ వికాసం, ఆంగ్ల భాషపై పట్టు, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పట్టు పెంచుకున్నా.

చదువుతున్న కళాశాలలోనే..

– పూజిత, నీలగిరి డిగ్రీ కళాశాల, నల్గొండ

బీజడ్‌సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. డిగ్రీలో చేరగానే ఆన్‌లైన్‌లో టాస్క్ సభ్యత్వం తీసుకున్నా. తద్వారా విద్యా సంవత్సరం ముగిసే వరకు శిక్షణ తీసుకునే అవకాశం లభించింది. చదువుకునే చోటే భవితను మార్చే శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా భావ వ్యక్తీకరణ సామర్థ్యాలు, ఇంటర్వ్యూలను సమర్థంగా ఎదుర్కోవడం, సమస్య- పరిష్కార నైపుణ్యాలు, క్యాంపస్ టు కార్పొరేట్ స్కిల్స్‌పై పట్టు సాధించాను.

ఆంగ్ల భాషపై పట్టు

– నిఖిత, బీకాం తృతీయ సంవత్సరం

టాస్క్ శిక్షణ ద్వారా ఆంగ్ల భాషపై పట్టు సాధించాను. ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి, బృంద చర్చలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పట్టు సాధించా. టాస్క్ ఆధ్వర్యంలో నల్గొండ ఐటీ టవర్‌లో ఎప్పటికప్పుడు నిర్వహించే శిక్షణలో పాల్గొంటున్నాం. కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులు మాలో ఉద్యోగాలు సాధించగలమనే ధైర్యాన్ని నింపుతున్నాయి.



రాజస్థాన్ పల్లెటూరులా వేసిన సెట్

దండుమల్కాపురంలో.. రాజస్థాన్ సెట్

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: ఎడారి ప్రాంతం.. రాజస్థాన్‌లోని పల్లెటూరును తలపించేలా వేసిన సినిమా సెట్ ఆకట్టుకుంటోంది. ఇది యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని పారిశ్రామిక పార్కు పక్కనే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆనుకొని వేశారు. అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ సినిమా చిత్రీకరణ కోసం ఇరవై రోజుల క్రితమే ఏర్పాటు చేయగా.. ఐదు రోజుల పాటు సినిమా చిత్రీకరించారు. హీరోగా బాలకృష్ణ, హీరోయిన్‌గా ప్రగ్యా జైస్వాల్ నటిస్తుండగా.. కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే హీరో, హీరోయిన్‌లపై పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. అక్టోబరు మొదటి వారంలో షూటింగ్ పునఃప్రారంభం కానుంది.

నటుల కోసం వేసిన గృహాలు..

సరకులను విక్రయించే కొట్టు

పేద ఖైదీల జామీనుకు వెసులుబాటు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో క్షణికావేశంలో చిన్నపాటి తప్పులు చేసి జైలు పాలై విడుదల కోసం అనుమతి వచ్చినా ఆర్థిక స్తోమత లేక జామీను ఇచ్చే వారు లేక జైళ్లలో మగ్గుతున్న పేద ఖైదీలకు సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల ప్రత్యేక వెసులు బాటు కల్పించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సర్వోన్నత న్యాయస్థానం తీసుకొచ్చిన జీవోను జిల్లాలో ప్రత్యేక సమావేశం ద్వారా అమలు చేస్తున్నారు. జైళ్ల శాఖ జిల్లా స్థాయి సాధికార కమిటీలో కలెక్టర్ ఛైర్మన్‌గా, జిల్లా జైలు సూపరింటెండెంట్ కన్వీనర్, జిల్లా ప్రొహిబిషన్ అధికారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ఒక న్యాయమూర్తితో పాటు ఎస్పీ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ గత నెల 18 నుంచి జిల్లాలో అమల్లోకి వచ్చింది. ఈ పథకం మార్గదర్శకాల్లో అవినీతి నిరోధక చట్టం, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నిర్దిష్ట నేరాలకు పాల్పడిన వ్యక్తులతో పాటు జాతీయ భద్రత, వరకట్న వేధింపులు, అత్యాచారాలు, హత్యలు, మానవ అక్రమ రవాణా, పోక్సో మాదక ద్రవ్యాలు వంటి క్రూరమైన నేరాలకు పాల్పడే వ్యక్తులకు ఈ పథకం వర్తించదు. నల్గొండ జిల్లా జైలుతో పాటు దేవరకొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, భువనగిరి సబ్ జైళ్లలో ప్రస్తుతం 270 మంది వరకు ఖైదీలు ఉన్నారు. వారిలో చిన్న చిన్న నేరాలు (పెట్టీ కేసులు) చేసి జైలుకు వెళ్లి జామీను తీసుకోవడానికి ఆర్థిక స్తోమత లేనివారు ప్రస్తుతం పది మంది లోపు ఉన్నట్లు తెలుస్తోంది. వీరికి ఆయా జిల్లాల కమిటీ ద్వారా జామీను ఇప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

స్వర్ణగిరికి అనతికాలంలోనే ప్రాచుర్యం

భువనగిరి, న్యూస్‌టుడే: స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అనతికాలంలోనే దేశంలోనే ప్రసిద్ధి క్షేత్రంగా పేరు ప్రఖ్యాతలు గడించిందని హాస్యబ్రహ్మ, సీనియర్ జర్నలిస్టు శంకరనారాయణ అన్నారు. శ్రీ రాగ రమ్య సాంస్కృతిక, సామాజిక సంస్థ ఆధ్వర్యంలో స్వర్ణగిరి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన సంగీత నృత్య నీరాజనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మికతను చాటడంతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు స్వర్ణగిరి క్షేత్రం వేదికగా నిలిచిందన్నారు. శ్రీ రాగ రమ్య సాంస్కృతిక, సామాజిక సంస్థ పలు పర్యాయాలు కనువిందు చేసే కార్యక్రమాలు నిర్వహించినందుకు నిర్వాహకులు రమ్యను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రాజెక్టు డైరెక్టర్ పతంజలి, శ్రీ రాగ రమ్య సాంస్కృతిక, సామాజిక సంస్థ నిర్వాహకురాలు రమ్య పాల్గొన్నారు. కళా గురువులు కృష్ణప్రియ కళ్యాణి, ప్రశాంతి, జయలక్ష్మి, విశాల్, మాధురి, యోగేశ్ శిష్య బృందాలు నృత్య ప్రదర్శనలు ఇచ్చాయి.

స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ రాగ రమ్య సాంస్కృతిక, సామాజిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతికోత్సవంలో మాట్లాడుతున్న హాస్యావధాని శంకరనారాయణ

బాలుడు, బాబాయ్‌ని బలిగొన్న అతివేగం

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ఆ బాలుడికి బాబాయ్ అంటే చాలా ప్రేమ. బాబాయ్‌కి కూడా అంతే అభిమానం. ఇద్దరూ కలిసి బంధువుల ఇంటికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో బాబాయ్, అబ్బాయ్‌లు ఇద్దరూ మృతిచెందిన దుర్ఘటన ఆదివారం నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చెన్నారం గేట్ మలుపు వద్ద చోటుచేసుకుంది. ఎస్సై రాంమూర్తి, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే జిల్లాకు చెందిన నేరెడుగొమ్ము మండలం బుగ్గతండాకు చెందిన లోటావత్ భీముడు(23), అతని అన్న కుమారుడు వెంకటేష్(8) కలిసి ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై నాంపల్లి మండలం రేఖ్యతండాలో గల బంధువుల ఇంటికి వెళ్తున్నారు. హైదరాబాద్-సాగర్ రాష్ట్ర రహదారిలో మండలంలో చెన్నారం గేట్ మలుపు వద్ద రాజధాని నుంచి ఐదుగురు విద్యార్థులు కారులో చీరాలకు వెళ్తూ అతివేగంతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ భీముడిని దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. మృతదేహాలను మరణోత్తర పరీక్షల నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

లోటావత్ భీముడు

లోటావత్ వెంకటేష్

మద్యం మత్తే ప్రమాదానికి కారణం

ఆదివారం సెలవు కావడంతో బీటెక్ చదువుతున్న ఐదుగురు యువకులు ఉత్సాహంగా గడిపేందుకు చీరాల బీచ్‌కు వెళ్తున్నామని విచారణలో తెలిపినట్లు ఎస్సై పేర్కొన్నారు. వారిలో ముగ్గురు మద్యం మత్తులో ఉండటమే కాకుండా వేగంగా నడపడం, మలుపు కావడంతో కారు పూర్తిగా అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు, అందులో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని.. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సెలవు లేకుంటే బతికేవారు

భీముడు చేపల వేటతో పాటు మెకానిక్‌గా పని చేస్తుండగా, బాలుడు వెంకటేష్ రెండో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇద్దరూ కలిసి బంధువుల ఇంటికి బయలుదేరారు. సెలవు లేకుంటే వెళ్లేవారు కారని మృతుల తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది.

EENADU Classifieds

BUSINESS SERVICES

SAREES

మావత్త కంచి, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & బెనారస్, కలకత్తా, సూరత్ ఫ్యాన్సీ చీరలు హోల్‌సేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. ✆ 73960 99834.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ॥ 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 9182260297.

Wanted Female Teacher & Central Manager An International Abacus and Brain Gym Programme, Working with Children (7-12 years) Training Provided. 99481 13392. Nalgonda.

PERSONAL CLASSIFIEDS

LOST

పందుల రామకృష్ణ, S/o అంజయ్య, గ్రా & మం॥ చండూర్, జి॥ నల్లగొండకు చెందిన ఒరిజినల్ ప్లాట్ డాక్యుమెంట్ నెం. 2224/2017 గలది అంగడిపేట నుండి చండూర్‌లోని రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు బైక్‌పై వస్తుండగా పోయినవి. దొరికినవారు సంప్ర॥ 90520 13212.

Book Your 5 Lines Classified Advertisement for B/W 355/- COLOUR 440/- (GST 5% Extra) Contact 96528 85838

JOBS

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ✆ 91609 00024, 96404 00073.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఆటో, కారు ఢీ.. వృద్ధురాలి మృతి

నిడమనూరు, న్యూస్‌టుడే: వేగంగా వచ్చిన ఓ గుర్తుతెలియని కారు.. ఆటోను ఢీకొట్టడంతో ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలై మృతిచెందిన ఘటన నిడమనూరు మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారమ్మగూడేనికి చెందిన **గడ్డం సుబ్బమ్మ**(60) పని నిమిత్తం మిర్యాలగూడ వెళ్లి తిరిగి ఆటోలో ఇంటికి వస్తోంది. ఆటో మరో అర్ధగంటైతే గ్రామానికి చేరుకునే అవకాశం ఉండేది. ఆటో ముదిమాణిక్యం కాలువ వద్ద ఉన్న మూలమలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగంలో కూర్చున్న సుబ్బమ్మకు కాలు రెండు చోట్ల విరగటంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన ఆమె కుటుంబసభ్యులు మిర్యాలగూడ ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నార్కెట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో చనిపోయినట్లు ఆమె బంధువులు తెలిపారు.

చికెన్ ధరలు	
ఫాంరేటు	115-00
రిటైల్	137-00
డ్రెస్డ్	199-00
స్కిన్‌లెస్	226-00

స్వాతంత్ర్య పోరాట యోధుడు రాధాకృష్ణ కన్నుమూత

చిట్యాల, న్యూస్‌టుడే: తాళ్లవెల్లంల గ్రామానికి చెందిన స్వాతంత్ర్య పోరాట యోధుడు కొండవీటి రాధాకృష్ణ(92) ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. అనారోగ్యంతో వారం రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. కొన్నేళ్ల క్రితం రాధాకృష్ణ కుటుంబంతో వెళ్లి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తన 14వ ఏటనే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా తుపాకీ పట్టి ఉద్యమించారు. ఎంఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసి, ఉపాధ్యాయుడిగా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి, డీఈవో స్థాయికి వెళ్లారు. ఆయనకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామంలో యువత కోసం 'నవ యుగ చైతన్య గ్రంథాలయం' ఏర్పాటు కోసం రూ.లక్ష పైచిలుకు వెచ్చించారు. అమెరికా నుంచి పెద్ద కుమారుడు, మనవళ్లు, మనవరాళ్లు, కుటుంబ సభ్యులు రావాల్సి ఉన్నందున అంత్యక్రియలు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

కొండవీటి రాధాకృష్ణ

ఐస్.. మల్లన్న..!

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఈయన.. 1998లో రెండు చక్రాల బండిని తోసుకుంటూ గల్లిగల్లీకి తిరిగి ఐస్‌క్రీమ్‌లు అమ్మడం ప్రారంభించాడు. 2007లో మూడు చక్రాల బండిగా మార్చి ఊళ్లలో తిరిగి అమ్మేవాడు. 2024లో ఆటోను ఐస్‌క్రీమ్ దుకాణంగా మార్చి ఆరు మండలాల్లో రోజుకు 12 నుంచి 16 గంటలు తిరుగుతూ వ్యాపారం చేస్తున్నాడు. కాలమేదైనా 26 ఏళ్లలో ఒక్క రోజైనా ఇంట్లో విశ్రాంతి తీసుకుంది లేదు. ఇన్నేళ్లలో జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడిందీ లేదు. సినీనటుడు నందమూరి బాలకృష్ణకు వీరాభిమాని. సినిమా విడుదలైందంటే ఐస్‌క్రీమ్ బండితో సహా వెళ్తుంటాడు. పనినే దైవంగా.. మల్లన్నస్వామికి భక్తుడిగా.. ఎప్పుడు భుజంపై ఆ దేవుడి గుర్తుగా పసుపు రంగు కండువా ధరించే ఈయన పేరు.. బాతరాజు మల్లేశ్ అలియాస్ ఐస్‌క్రీమ్ మల్లన్న.

చౌటుప్పల్‌లో ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్న బాతరాజు మల్లేశ్ అలియాస్ మల్లన్న

మల్లన్న జీవన ప్రస్థానం ఆయన మాటల్లోనే..

మాది సుంకెనపల్లి గ్రామం. 1974లో జన్మించా. మా ఊళ్లో అయిదో తరగతి వరకు చదివా. రోజూ మూడు కిలోమీటర్లు కాలినడకన గుండ్రాంపల్లికి వెళ్లి ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించా. పదిలో ఉత్తీర్ణుడ్ని కాకపోవడంతో చదువు ఆగిపోయింది. 1991లో హైదరాబాద్‌కు వెళ్లి సుల్తాన్‌బజార్, ఆబిడ్స్, మలక్‌పేటల్లోని మిఠాయి దుకాణాల్లో, కేఫ్‌లలో పని చేశా. అప్పుడే సినీనటుడు నందమూరి బాలకృష్ణపై అభిమానం ఏర్పడింది. ఆయన సినిమా విడుదలైందంటే ఆర్టీసీ చౌరస్తాలోని టాకీస్‌ల ఎదుట భారీ కటౌట్లు పెట్టేవాడ్ని.

✤ 24 ఏళ్ల వయసులో చిన్నకొండూరుకు చెందిన మేనమామ బిడ్డ భాగ్యమ్మతో పెళ్లయింది. హైదరాబాద్‌కు వెళ్లడం మానుకుని రూ.5వేలు పెట్టుబడితో చౌటుప్పల్‌లో పర్వతం యాదగిరి వద్ద రెండుచక్రాల బండి తీసుకుని ఎండాకాలంలో పాలు, సేమ్యా ఐస్‌క్రీమ్ అమ్మేవాడిని. వానాకాలం, చలికాలాల్లో క్రీమ్ తయారు చేసి బుర్రల్లో పెట్టి ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మి ఇంటికెళ్లేవాడ్ని. తర్వాత మూడుచక్రాల బండి తెచ్చా. దాన్ని తొక్కుకుంటూ 2018వరకు నల్గొండ క్లాసిక్ కంపెనీ నుంచి తెచ్చిన చాకోబార్, కప్పు, కుల్ఫీ, కోన్‌లు రాత్రి వరకు అమ్మేవాడ్ని.

కరోనా రావడంతో ప్రజలు ఐస్‌క్రీమ్‌లు, తినుబండారాలను తినడం తగ్గింది. దీంతో పేరున్న కంపెనీ ఐస్‌క్రీమ్‌లు మాత్రమే అమ్మేందుకు నిర్ణయించుకుని వాయిదా పద్ధతిలో నెలకు రూ.12 వేలు చెల్లించేలా 9 నెలల క్రితం రూ.3.40లక్షలతో ఆటో కొన్నా. రూ.లక్షతో ప్రత్యేకంగా వాహనాన్ని తయారు చేయించా. రూ.1.20 లక్షలతో ఫ్రిజ్ ఏర్పాటు చేయించా. దీనిపై చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, మునుగోడు, భూదాన్ పోచంపల్లి, వలిగొండ, నార్కట్‌పల్లి మండలాల్లో ఎక్కడ జాతరలు, పండగలు, విందులున్నా అక్కడికెళ్లి ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నా. మధ్యాహ్నం నుంచి రాత్రి ఒంటి గంట వరకు పంతంగి టోల్‌ప్లాజా వద్ద బండి ఉంటుంది. కార్లలో, ట్రావెల్స్ బస్సుల్లో వెళ్లేవాళ్లు నా వద్ద ఐస్‌క్రీమ్‌లు కొంటుంటారు. పిల్లలకు, వృద్ధులకు ఉచితంగా ఇస్తుంటా.

సర్కారు చేయూత ఇచ్చింది

స్పందనకు వందనం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: పురపాలిక పరిధి తాళ్లసింగారానికి చెందిన ఎడ్ల సత్తమ్మ (71) అయిదేళ్ల నిరీక్షణ ఫలించింది. వితంతు పింఛను ప్రభుత్వం నుంచి మంజూరైంది. ఈమె భర్త మల్లయ్య అయిదేళ్ల క్రితం మరణించాడు. ఈమె చనిపోయిందని అధికారులు తప్పుగా నమోదు చేయడంతో వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. ఆమె గోడును 'ఈ సర్కారైనా చేయూత ఇస్తుందా..?' శీర్షికతో 'ఈనాడు'లో జనవరి అయిదో తేదీన ప్రచురించింది. డీఆర్డీవో దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి వివరణ కోరడంతో ఆయన స్పందించి పింఛను విభాగం వారికి సూచనలిచ్చారు. సమస్యను సుదీర్ఘ కాలానికి పరిష్కరించారు. చౌటుప్పల్‌లోని తపాలా కార్యాలయంలో పోస్ట్ మాస్టర్ బెదరకోట రమేశ్ ఆమెకు పాస్‌బుక్కు, ప్రభుత్వం నుంచి మంజూరైన మూడు నెలల పింఛను రూ.6,048 శనివారం అందజేశారు. తపాలా ఉద్యోగి ఎండి మసూద్ పాల్గొన్నారు. అయిదేళ్ల ఎదురు చూపుల తర్వాత పింఛను మంజూరైనందుకు ఆమె సంతోషంతో కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఎడ్ల సత్తమ్మకు చౌటుప్పల్ పోస్టాఫీసులో పాసు పుస్తకం, పింఛను డబ్బు అందిస్తున్న పోస్టుమాస్టర్ బెదరకోట రమేశ్

కాలనీలు.. హరిత లోగిళ్లు

స్నిగ్ధ కాలనీలోని పార్కులో పూల మొక్కలు


టీచర్స్ కాలనీలో దారికి ఇరువైపులా భారీ వృక్షాలు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలోని పలు కాలనీలు పచ్చదనంతో విలసిల్లుతున్నాయి. ముందు చూపుతో కాలనీ వాసులు నాడు నాటిన మొక్కలు ప్రస్తుతం భారీ వృక్షాలుగా ఎదిగి హరితహారంలా మారాయి. పట్టణంలోని స్నిగ్ధ, టీచర్స్ కాలనీల్లో ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తోంది. కాలుష్య రహిత వాతావరణం నెలకొనడంతో ఆయా కాలనీల్లో నివసించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. రెండు కాలనీల్లో నివాసముంటున్న వారు క్రమం తప్పకుండా మొక్కలు నాటుతూ పచ్చదనం పెంపొందిస్తున్నారు. స్నిగ్ధ కాలనీలో 200 ఇంటి స్థలాలు ఉండగా 60 మంది ఇళ్లను నిర్మించుకున్నారు. కాలనీలో మూడు అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఒక్కో ఇంటి నుంచి నెలకు నిర్వహణ ఖర్చుల కోసం రూ.500 వసూలు చేస్తున్నారు. 1998లో ఏర్పాటు చేసిన టీచర్స్ కాలనీలో 56 ప్లాట్లు ఉండగా 50 మంది ఇళ్లను నిర్మించుకున్నారు. నాడు రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ప్రస్తుతం భారీ వృక్షాలుగా మారి నీడను ఇస్తున్నాయి. రెండు కాలనీల వాసుల ఆసక్తి గుర్తించిన పురపాలకులు రెండు కాలనీల్లో పార్కులను నిర్మించారు. టీచర్స్ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్నిగ్ధ కాలనీ పార్కులోని పూల మొక్కలు, పచ్చదనం ఆహ్లాదం పంచుతున్నాయి.

కూలకముందే కూల్చండి



గోడలపై చెట్లు మొలిచి, శిథిలమైన ఈ భవనం మోత్కూరు మండలం దత్తప్పగూడెం ప్రాథమిక పాఠశాలకు చెందినది. ఈ బడిలో ఐదు కొత్త గదులుండగా, సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన మరో ఐదు గదులున్నాయి. వీటిలో నాలుగు శిథిలావస్థకు చేరగా, ఒక గది బాగానే ఉండటంతో అందులో ఆఫీసు నిర్వహిస్తున్నారు. మొత్తం 46 మంది విద్యార్థులున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 'శిథిల గదులను పరిశీలించి, జిల్లా అధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామ'ని ఎంఈవో టి. గోపాల్‌రెడ్డి తెలిపారు. మోత్కూరు, న్యూస్‌టుడే:

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80082 78928 80085 74375

బొమ్మలరామారం , న్యూస్‌టుడే:

? బొమ్మలరామారం ప్రధాన చౌరస్తాలో ఆటోలు, తోపుడు బండ్లు, ఉండటంతో బస్సులు తిరగడం, ద్విచక్ర వాహనాలు, కార్లు వెళ్లడానికి చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి.

–శ్రీనివాస్, బొమ్మలరామారం.

✓ మండల కేంద్రంలోని సమస్య వెంటనే పరిష్కరిస్తాం. –శ్రీశైలం, ఎస్సై

పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమించండి

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో ఓ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా పరిసర గ్రామాల ప్రజలు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జల్లెల పెంటయ్య కోరారు. కొమ్మాయిగూడెంలో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామ మహాసభలో పాల్గొని మాట్లాడారు. అడ్డుకునేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బొడ్డుపల్లి వెంకటేశం, బోయిని ఆనంద్, సుమలత, వెంకటేశ్వర్లు, రవీందర్, కాటమయ్య, నాగయ్య పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: బీఎస్పీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జిలు గందమల్ల లింగస్వామి, అధ్యక్షుడు బాసాని మహేందర్ అన్నారు. భువనగిరిలో ఆదివారం ఆ పార్టీ జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బట్టు రామచంద్రయ్య, ఉపాధ్యక్షులు గడ్డం వీరస్వామి, ప్రధాన కార్యదర్శి కొమ్ము ప్రకాష్, కోశాధికారి సల్ల భిక్షపతి పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

ఆలేరు: కొలనుపాకలోని ఉప్పుగడ్డవాడ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బెదరబోయిన సిద్ధిరాములు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

కొలనుపాక ముదిరాజ్ సంఘం నూతన కమిటీ

మరో 12 మంది కమిటీలో వివిధ పదవులలో నియమితులయ్యారు. ముదిరాజ్‌ల సంక్షేమం, హక్కుల సాధనకు కృషి చేస్తామని నూతన కమిటీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు అన్నారు.

రైతు దీక్ష విజయవంతానికి పిలుపు

భువనగిరి, న్యూస్‌టుడే: రైతు సమస్యల పరిష్కారానికి హైదరాబాద్ ఇందిరాపార్కు దగ్గర సోమవారం భాజపా ఆధ్వర్యంలో చేపట్టే రైతు దీక్ష విజయవంతం చేయాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో కోరారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హామీల అమలుకు భాజపా శాసనసభాపక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరైన విజయవంతం చేయాలని కోరారు.

గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి

రామన్నపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ డిమాండ్ చేశారు. వెల్లంకిలో ఆదివారం నిర్వహించిన సీపీఎం మహాసభలో మాట్లాడారు. గవర్నర్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. ఈ వ్యవస్థను అడ్డం పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కేంద్రం కాలరాస్తుందని ఆరోపించారు. మేక అశోక్‌రెడ్డి, జల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, కూరెళ్ల నర్సింహాచారి, వనం ఉపేందర్, ఆవనగంటి నగేశ్, బాబురావు, నర్సింహ, పున్న దత్తాద్రి పాల్గొన్నారు.

వెల్లంకిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

దీనదయాళ్ స్పర్శ్ యోజన అర్హత పరీక్ష

చౌటుప్పల్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీనదయాళ్ స్పర్శ్ యోజన ఉపకార వేతనాల మంజూరు కోసం చౌటుప్పల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తపాలా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదివే 68 మంది పరీక్షకు హాజరయ్యారు. అర్హత సాధించినట్టయితే ఏడాదికి రూ.6000 చొప్పున ఉపకార వేతనం మంజూరవుతుందని తపాలాశాఖ అధికారి బుజ్జిబాబు తెలిపారు. అధికారులు బి. నర్సింహ, శ్రీకాంత్, ప్రవీణ్, ఎండి మసూద్ అలీ, షబ్బీర్‌ఖాన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో దీనదయాళ్ స్పర్శ్ అర్హత పరీక్ష నిర్వహిస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

కృష్ణ కౌండిన్యకు పురస్కారం అందజేత

రామన్నపేట: రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు, ప్రముఖ సాహితీవేత్త డాక్టరు కృష్ణ కౌండిన్యకు చిలుకలూరిపేటకు చెందిన జయ జయ సాయి ట్రస్టు జాతీయ సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తెలుగు, సాహిత్య సామాజిక రంగాల్లో కృష్ణ కౌండిన్య చేస్తున్న కృషిని గుర్తించి ట్రస్టు ఈ పురస్కారాన్ని ప్రకటించింది. కాగా చిలుకలూరిపేటలో ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు పురస్కారాన్ని అందజేసినట్లు డాక్టరు కృష్ణ కౌండిన్య ఆదివారం తెలిపారు.

డాక్టర్ కృష్ణ కౌండిన్యకు పురస్కారం అందజేస్తున్న చిలుకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు

భాజపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరం ప్రారంభిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్

ఆత్మకూర్(ఎం), న్యూస్‌టుడే: భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకొని సేవా సత్తా కార్యక్రమంలో భాగంగా ఆత్మకూర్‌లో ఆదివారం భాజపా ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వైద్యం అందించే ఉద్దేశంతోనే ఈ వైద్య శిబిరమని తెలిపారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్, జిల్లా నాయకుడు గుజ్జ సోమనర్సయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, కుమారస్వామి, సత్యనారాయణ, సత్తిరెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు..

వలిగొండ: భాజపాను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ అన్నారు. టేకులసోమారంలో ఆదివారం చేపట్టిన భాజపా సభ్యత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం వీక్షించారు. కార్యక్రమంలో దంతూరి సత్తయ్య, సీలోజు శ్రీరాములు, బచ్చు శ్రీనివాస్, గంగదారి దయాకర్, దయ్యాల వెంకటేశ్, మందడి రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి ప్రవాహంలో చిక్కుకున్న కారు

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండలం భైరాంనగర్ వాగు నీటిలో కారు నిలిచిపోయింది. హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడు ఆదివారం గూగుల్ మ్యాప్ ఆధారంగా యాదగిరిగుట్ట నుంచి బచ్చన్నపేటకు వెళ్లే క్రమంలో భైరాంగనర్ వాగు వద్దకు చేరాడు. గంధమల్ల చెరువు అలుగు పోస్తుండటంతో రెండు రోజులుగా వాగుకు జలకళ వచ్చింది. భైరాంగనర్‌కు చెందిన పిల్లలు వాగునీటిలో ఆడుకుంటున్నారు. వాగులో ఉన్న మట్టిదారి కొట్టుకుపోయింది. విషయం తెలియని సదరు యువకుడు కారును ముందుకు పోనివ్వడంతో వాగు నీటిలో నిలిచిపోయింది. పరిసర రైతులు గమనించి ట్రాక్టరు సాయంతో కారును బయటకు లాగారు. కారులోని యువకుడు తన వివరాలు చెప్పేందుకు నిరాకరించాడు.

ఆత్మీయ సమ్మేళనం

యాదగిరిగుట్ట అర్బన్: యాదగిరిగుట్టలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 2008-11 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయ బృందాన్ని సాదరంగా ఆహ్వానించి వారిని సత్కరించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

సంస్థాన్‌నారాయణపురం, న్యూస్‌టుడే: మండలంలోని కంకణాలగూడెంలో ఎన్‌ఆర్‌జీఎస్ నిధులులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరంటోతు శ్రీనునాయక్ ఆదివారం శంకస్థాపన చేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కరంటోతు ప్రజ్ఞానాయక్, ఏపూరి సతీష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

వందేళ్ల గుడిని వెనక్కి జరిపి.. పండగ ప్రారంభించి

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు పుర పరిధిలో ప్రధాన రోడ్డు వెడల్పు, మురుగుకాల్వల నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న స్థానిక పాతబస్టాండ్ సమీపంలో వందేళ్ల క్రితం నిర్మించిన ఈదమ్మ గుడిని వడ్డెరులు స్వచ్ఛందంగా వెనక్కి జరిపి నూతన ఆలయాన్ని నిర్మించుకున్నారు. ఆదివారం కొత్త ఆలయంలోకి పాతగుడి నుంచి దేవతా విగ్రహాలను తరలించే కార్యక్రమాన్ని స్థానికులు ప్రారంభించారు. అనంతరం ఈదమ్మ పండగ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పుర ఇన్‌ఛార్జి కమిషనర్ సి.శ్రీకాంత్, సింగిల్‌విండో ఛైర్మన్ పి.వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ పి.వెంకన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.రామచంద్రుగౌడ్, వడ్డెరుల కుల పెద్ద కొణతం వెంకులు పాల్గొన్నారు. కొణతం ఇద్దయ్య, కె.అంజయ్య, కె.సత్తయ్య, కె.మల్లయ్య, పల్లపు బిక్షం, గొలుసుల వెంకన్న, కె.నరేందర్, బయ్యని రాజు, టి.లక్ష్మీనర్సయ్య కొమరయ్య, పూజారులు చిన్నపాక పర్వతాలు, కడియం ఎల్లయ్య పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్, పుర ఇన్‌ఛార్జి కమిషనర్, సింగిల్‌విండో ఛైర్మన్, తదితరులు

దోపిడీ లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా భాజపా మత రాజకీయాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాజారెడ్డి అన్నారు. భువనగిరి అర్బన్‌కాలనీలోని పద్మశాలి భవనంలో ఆదివారం భువనగిరి నియోజకవర్గ మండల సమితి, ప్రజా సంఘాల సభ్యులు రాజకీయ శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. దోపిడీ లేని సమాజ నిర్మాణానికి ఉద్యమించాలన్నారు. ప్రొఫెసర్ మార్క్స శంకర్‌నారాయణ మాట్లాడుతూ.. అమర వీరుల స్ఫూర్తితో హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ.. మూసీ కాలుష్యంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా ప్రక్షాళన చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిలా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు బోడ సుదర్శన్, చెక్క వెంకటేష్, ఎల్లంకి మహేష్, వస్తువుల అభిలాష్, ఉప్పల శాంతికుమార్, మద్రిపల్లి రాములు, పోలేపాక యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

సావిత్రిబాయిఫులే జీవితం ఆదర్శం

గుండాల, న్యూస్‌టుడే: సావిత్రిబాయిపులే జీవితం నేటి సమాజానికి ఎంతో ఆదర్శమని సావిత్రి బాయి పులే విగ్రహ కమిటీ ఛైర్మన్ నల్ల సోంమల్లయ్య అన్నారు. ఆదివారం గుండాల వాసవీగార్డెన్‌లో నిర్వహించిన సావిత్రిబాయి పులే, జ్యోతిరావు పులే విగ్రహాల ఏర్పాటు కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు, బలహీనవర్గాల అభ్యున్నతికి వారు చేసిన కృషి మరువలేనిదన్నారు. విగ్రహాల ఏర్పాటుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ఎండి. షర్ఫోద్దీన్, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ గడ్డమీది పాండరీ, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరిగౌడ్, విగ్రహ కమిటీ సభ్యులు దేవనబోయిన అయిలయ్య, లింగయ్య, చిందం ప్రకాశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విగ్రహ కమిటీ ఛైర్మన్ సోంమల్లయ్య

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నెమ్మానిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు...రామన్నపేట మండలంలోని జనంపల్లికి చెందిన చొప్పరి వెంకయ్య(55), నిత్యం సమోసాలు కొనుగోలు చేసి.. చిట్యాల, నార్కట్‌పల్లి, రామన్నపేట మండలాల్లోని గ్రామాల్లో సైకిల్‌పై తిరుగుతూ విక్రయిస్తుంటారు. అందులో భాగంగా నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మానిలో రోడ్డు సమీపంలో సైకిల్ నిలిపి సమోసాలు విక్రయిస్తుండగా అమ్మనబోలు వైపు వెళ్తున్న కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతి కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

ఆత్మకూర్(ఎం), న్యూస్‌టుడే: ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఎలగందుల మల్లయ్య చెందిన రెండు ట్రాక్టర్లకు చెందిన బ్యాటరీలను, ఏనుగు ప్రభాకర్‌కు చెందిన మరో ట్రాక్టర్ బ్యాటరీలను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.కృష్ణయ్య తెలిపారు.

చిన్నరావులపల్లిలో దొంగతనం

బీబీనగర్, న్యూస్‌టుడే: ఆస్పత్రికి వెళ్లొచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన బీబీనగర్ మండలం చిన్నరావులపల్లిలో చోటు చేసుకుంది. బీబీనగర్ ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బెజవాడ పద్మ వృత్తి రీత్యా కూలీ పనిచేస్తోంది. శనివారం ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లింది. తిరిగి వచ్చే చూసే సరికి ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంటి వెనుక తలుపులు నుంచి లోనికి చొరబడిన దుండగులు మూడు తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు బీబీనగర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జిల్లో తనిఖీలు

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట పట్టణంలో పలు లాడ్జిలలో సీఐ రమేష్ నేతృత్వంలోని పోలీస్ బృందం తనిఖీలు నిర్వహించింది. లాడ్జిలోకి వచ్చే వారి ఆధార్, తదితర వివరాలను తప్పని సరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని 29వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కూర వెంకటేష్, నాయకులు గ్యాస్ చిన్నా, కంసాని వెంకటేష్, కిరణ్, సామల భాస్కర్, బాలకృష్ణ, మహేందర్, పోతంశెట్టి మంజుల పాల్గొన్నారు.

మహిళలకు మొక్కలు పంపిణీ చేస్తున్న పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

రాజపేట, న్యూస్‌టుడే : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను ఎక్కువ సంఖ్యలో గెలిపించుకుని సత్తా చాటాలని మహిళా విభాగం మండల అధ్యక్షురాలు నాగారం రేణుక అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు నెమిల నర్సమ్మ, ఉపేంద్ర, విజయాబాయి, ఉమ పాల్గొన్నారు.

రాజపేటలో కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మహిళా నాయకులు

ప్రొటోకాల్ పాటించాలి

మోత్కూరు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యకు మెదక్ జిల్లాలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకపోవడాన్ని ఖండిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు దాసరి తిరుమలేష్ అన్నారు. ఆదివారం మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. కె.వీరపెద్దులు, జి.సోమయ్య, జి.నర్సయ్య, కె.రమేష్, కె.నర్సింహా, నవీన్, చంద్రశేఖర్, కృష్ణ ఉన్నారు.

'రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం'

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: అర్హులైన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి పాండు విమర్శించారు. ఆదివారం మండలంలోని డి.రేపాకలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ మహాసభలో కార్యదర్శిగా శీలం శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల కార్యదర్శి బుర్రు అనిల్‌కుమార్, మాజీ కార్యదర్శి వల్లంభట్ల శ్రీనివాసరావు, నాయకులు చిత్తలూరి మల్లయ్య, స్వామి పాల్గొన్నారు.

ఉద్యమకారులకు

ఇళ్ల మంజూరుకు విన్నపం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకుడు కట్టెల లింగస్వామి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరారు. 2009 నుంచి 2014 వరకు నిర్వహించిన పలు ఉద్యమాల్లో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నామని, కోర్టుల చుట్టూ తిరిగామని, జైలు జీవితం అనుభవించామని తెలిపారు. ఆర్థికంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడినా గత ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రభుత్వం ఉద్యమకారులకు తొలి విడతలోనే 250 గజాల ఇంటి స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నివాస స్థలాలు కేటాయించండి

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: భువనగిరి పురపాలిక పరిధిలోని బొమ్మాయిపల్లి సర్వే నెంబరు 700లో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు ఇచ్చిన 105 మందికి స్థలం కేటాయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. భువనగిరిలోని తారక రామానగర్‌లో 12వ శాఖ మహాసభను ఆదివారం నిర్వహించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణ కార్యవర్గ సభ్యులు గంధమల్ల మాతయ్య, బందెల ఎల్లయ్య, సభ్యులు మామిడి భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐలూ ఆధ్వర్యంలో సన్మానం

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ చేస్తున్న న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డిని ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రామన్నపేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మజీద్, న్యాయవాదులు బొడ్డు కిషన్, బాలరాజు, ఐలయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

'హమాలీలకు పని కల్పించకుండా ప్రయత్నాలు'

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: కొత్త మార్కెట్ యార్డులో హమాలీ కార్మికులకు పని కల్పించకుండా కొనసాగుతున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇమ్రాన్ ప్రకటనలో డిమాండ్ చేశారు. బియ్యంలో పురుగులు వస్తున్నాయన్న సాకు చూపుతూ గోదాముల్లో బియ్యం నిల్వలు తగ్గించడం వల్ల హమాలీలకు పనిలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు కొత్త మార్కెట్ యార్డులో బియ్యం నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం

అడ్డగూడూరు: చౌళ్లరామారానికి చెందిన రాయల సామేలు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో వాట్సాప్ గ్రూప్ సభ్యులు స్పందించి ఆదివారం రూ.22 వేల ఆర్థికసాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. తలపాక మహేష్, భాస్కర్, మల్లేష్, కిష్టయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ఆత్మకూర్(ఎం), న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించాలని కోరుతూ ఆదివారం రాఘవభారతి గ్రంథాలయం కమిటీ సభ్యులు యాదగిరిగుట్టలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతి పత్రం అందజేశారు. కమిటీ అధ్యక్షుడు వంగాల రమేష్, బంటు తిరుమలేష్, కొంపెల్లి వెంకటేశం, శ్రవణ్, మహేష్, ఎండి.నహీం, కూరెళ్ల సురేష్, ప్రశాంత్, దయాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్యకు వినతి పత్రం అందజేస్తున్న రాఘవభారతి గ్రంథాలయం కమిటీ సభ్యులు

(c) eenadu